క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మకర జ్యోతి దర్శనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లో వెలసిన శ్రీ శాస్తగిరి అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి శాస్త్రోక్తంగా వెలిగించారు. ఆలయంలోని అయ్యప్ప స్వామికి ఉదయం అభిషేక పూజలు చేశారు. తర్వాత మకర జ్యోతి దర్శన పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర వీధుల్లో ఊరేగించి మకర జ్యోతి దర్శనం కల్పించారు. జ్యోతి దర్శనార్థం భక్తులు పోటెత్తారు.

నందీశ్వరునిపై శివపార్వతుల విహారం



తవణంపల్లె: కనుమ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అరగొండలో ఉన్న శివాలయంలో బుధవారం ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణతోపాటు పూజలు చేసి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం సుగంధ పుష్పాలతో అలంకరించిన నందీశ్వరునిపై శివపార్వతులు విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న వెంకటేష్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో సంక్రాంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. నగరానికి చెందిన సకల వెంకటేష్ గుప్త నిరాశ్రయుల కేంద్రంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాంబ తిరునాళ్లు



గుడిపాల: మండలంలోని గట్రాళ్లమిట్టలో బుధవారం రేణుకాంబ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. బొమ్మసముద్రంలోని సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వృషభం.. పౌరుషం



ఐరాల: ఎద్దును నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకుడు

తెలుగువారి అతిపెద్ద పండుగైన సంక్రాంతి సంబరాల్లో మూడోరోజు కనుమ పండుగను గ్రామాల్లో కోలాహలంగా నిర్వహించారు. పశువులను నీటితో శుభ్రం చేసి, ప్రత్యేక పుష్పాలు, పలకలు, బెలూన్లతో అందంగా అలంకరించారు. వీధుల్లో పరుగులు తీయించారు. కొన్ని చోట్ల ఎద్ల పందేలు నిర్వహించడంతో, తిలకించేందుకు జనం తరలివచ్చారు. దూసుకొచ్చిన ఎద్దులను నిలువరించేందుకు యువత సాహసాన్ని ప్రదర్శించి, బహుమతులు అందుకున్నారు.



చిత్తూరు: తుమ్మిందలో దూసుకొస్తున్న ఎద్దు

- తుమ్మిందలో జల్లికట్టు
- తూంపాయన పల్లెలో ఎడ్లపందేలు
- గుట్టకిందపల్లెలో రంకెలేసిన కోడెగిత్తలు
- కోలాహలంగా కనుమ పండుగ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కనుమ పండుగను పురస్కరించుకుని చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం జల్లికట్టును ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత గోవులకు శ్రీకృష్ణ దేవాయలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎద్దులను పరుగులు పెట్టించారు. రంకెలేస్తున్న ఎద్దులను పట్టుకునేందుకు యువకులు ముందుకు దూసుకెళ్లారు. ఈ తరుణంలో ఎద్దులు బుసలు కొడుతూ, అడ్డొచ్చినవారిని తోసుకుంటూ, తొక్కుకుంటూ పరుగులు తీశాయి. అయినా కొందరు యువకులు మూకుమ్మడిగా ఎద్దులను చుట్టుముట్టి, ఒడిసిపట్టి నిలువరించారు. అనంతరం బహుమతులు అందుకున్నారు. ఈ పందేలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు వేలాదిగా తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో సంక్రాంతి

సంక్రాంతి సంబరాలు పల్లెకు కొత్త శోభను తీసుకొచ్చాయి. మహిళలు ప్రతి ఇంటా రంగువల్లులు, వాటి మధ్య గొబ్బెమ్మలు ఉంచి సంప్రదాయ పద్ధతులు ఉట్టిపడేలా లోగిళ్లను సిద్ధం చేశారు. గ్రామీణులు పండుగ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కులదేవతకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ మురిసిపోయారు. బుధవారం కనుమ పండుగను పురస్కరించుకుని గోపూజలు చేశారు. గోవులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేయించారు.

తూంపాయనపల్లెలో ఎడ్ల పందేలు

బంగారుపాళెం: మండలంలోని తూంపాయనపల్లెలో బుధవారం నిర్వాహకులు పశువుల పరుగు పందెం నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా నిర్వహించిన పశువుల పరుగు పందేలకు పరిసర ప్రాంతాల నుంచి యజమానులు పశువులను వాహనాల ద్వారా తీసుకు వచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరుగు పందాలు కోలాహలంగా సాగాయి. పౌరుషంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. దూసకొచ్చిన ఎద్దులు వీరిని తొక్కుకుంటూ వెళ్లడంతో పలువురికి యువకులు స్వల్ప గాయాలయ్యాయి. పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. వీటిని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



చిత్తూరు: ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

దుమ్మురేపిన కోడెగిత్తలు

ఐరాల: మండలంలోని గుట్టకిందపల్లె, పేరయ్యగారిపల్లె గ్రామాల్లో బుధవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించిన ఎండ్ల పందేలు హోరెత్తించాయి. యువత కేరింతలు, మందుబాబుల అల్లర్లు, కేకలతో గ్రామాల్లో ఎడ్ల పందెలు దుమ్మురేపాయి. గోమాతలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల వద్ద పూజలు చేశారు. అభిమాన హీరోల చిత్రపటాలతో పాటు ఎడ్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అప్పటికే చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో చేరుకున్న యువత పందేనికి తాము రెడీ అన్నట్లు అల్లి వద్ద నిలబడి కోడెగిత్తలను ఉసిగొల్పారు. దీంతో కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన సమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. ఎద్దులను నిలువరించి పలకలు లాక్కోవడానికి యువత పోటీ పడ్డారు. మరోవైపు తాళ్లతో కట్టిన కసిరెద్దులు పౌరుషంగా రంకెలేస్తూ జనం మీదుకు దూసుకుపోయాయి. దీంతో యువకులు పశువుల దూకుడును కట్టడి చేయలేకపోయారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు రావడంతో గ్రామాల్లోని మిద్దెలపై జన సందడి కనిపించింది.

ఘనంగా సంక్రాంతి పండుగ

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం కాలం చేసిన కుటుంబ పెద్దలకు నూతన దుస్తులు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. మూడోరోజు బుధవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో రైతులు పశువులను ప్రత్యేక అలంకరించి గోపూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా గ్రామ వీధుల్లో ముస్తాబు చేసిన పశువులను పరుగులు తీయించారు.




ఐరాల: గేదెను నిలువరిస్తున్న యువకులు, పౌరుషంగా దూసుకువస్తున్న ఎద్దు




బంగారుపాళెం: గోపూజ చేస్తున్న రైతులు, తూంపాయనపల్లెలో పరుగులు తీస్తున్న కోడెగిత్త

జాతీయస్థాయి పోటీలకు చిత్తూరు విద్యార్థిని



చిత్తూరు కలెక్టరేట్: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు చిత్తూరుకు చెందిన విద్యార్థిని స్నేహా ఎంపికైంది. ఆ విద్యార్థిని జిల్లా కేంద్రంలోని ఆర్‌కే మోడల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇటీవల పాలకొల్లులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. త్వరలో తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొననుంది. ఆ విద్యార్థినిని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్‌రాయల్ నాయుడు, సభ్యులు సురేష్, లక్ష్మీపతి, పీడీ బాబు అభినందించారు.

పల్లె లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు

ఐరాల: మండలంలోని పల్లె సీమల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కనుమ పండుగ సందర్భంగా బుధవారం మహిళలు ఇంటి ముందు కళ్లాపి చల్లి, రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. కాలం చేసిన కుటుంబ పెద్దలకు నూతన వస్త్రాలు పెట్టి పూజలు చేశారు. గ్రామాల్లో రైతులు పశువులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేసి, గ్రామ వీధుల్లో వాటిని పరుగులెత్తించారు.

జానకారపల్లిలో శ్రీవారి ఉత్సవం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జానకారపల్లిలో మంగళవారం సంక్రాంతి, శ్రీవారి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణ భజన మందిరంలో ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ లక్ష్మణస్వామి, స్థానిక యువత ఆయనను సన్మానించారు. పుష్పపల్లకి సేవను కర్పూర హారతితో ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



భజన మందిర ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి



ఐరాల: వీఎస్.అగ్రహారంలో రంగురంగుల ముగ్గులో గొబ్బెమ్మ

అమ్మవారికి వెండి హారం సమర్పణ

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని శ్రీ అల్లి ఎల్లమ్మ అమ్మవారికి భక్తుడు నరసింహనాయుడు రూ.40 వేల రూపాయల విలువ గల వెండి ఆభరణాన్ని సమర్పించారు. గంగాధర నెల్లూరు మండలం కనికాపురం గ్రామానికి చెందిన నరసింహనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

వేణుగోపాలుడి అభయం

కార్వేటినగరం: సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.15 నుంచి 7.30 గంటల వరకు ఉభయ దేవేరులతో పాటు స్వామి వారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి పాల్గొన్నారు.

శునకాలు పట్టేస్తున్నాయి



- పల్లెల్లో కుక్కలతో ఇబ్బందులు
- గ్రామాల్లో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

తవణంపల్లె: మండలంలోని గ్రామాల్లో శునకాలు యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు కుక్కకాటుకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు. దీంతో ప్రజలు వీధిలోకి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వీధి కుక్కలను నియంత్రించడంలో పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కుక్కల బెడదతో చిన్నారులు హడలిపోతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బయటకు పంపాలంటే ఆందోళన చెందుతున్నారు.

పల్లెల్లో స్వైర విహారం

మండలంలోని గ్రామాల్లో వీధి వీధినా ఓ కుక్కల గుంపు తయారైంది. ఒక కుక్క భౌ అంటే చాలు.. ఇక ఒక దాని వెంట ఒకటి అరవడం మొదలెడతాయి. వీటికి ప్రాంతీయ అభిమానం మెండుగా ఉంటుంది. ఏ వీధిలో కుక్క ఆ వీధిలో మాత్రం సంచరించాలి. అలా కాదని పక్క వీధిలోకి వెళితే అక్కడున్న కుక్కల గుంపు వెంటాడుతుంది. రాత్రిపూట కుక్కల గోల భరించలేక జనం నానా అవస్థలు పడుతున్నారు. అర్ధరాత్రిలో ఒకదాని వెంటే అరుస్తూ, ఏడుస్తూ.. ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా ఇవి గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వీధుల్లో తిష్ట వేసి, రాత్రింబవళ్లు తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. కుక్కల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోయి ప్రశాంతంగా తిరగలేకపోతున్నారు.

కుక్కల సంచారంతో రోడ్డు ప్రమాదాలు

రోడ్లు పక్కన కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ రోడ్డుపైకి ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహనచోదకులు అధిక సంఖ్యలో ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని తవణంపల్లె, మత్యం క్రాస్, దిగువ తడకర, అరగొండ, గాజులపల్లె, ఐరాల క్రాస్, షికారీ కాలనీ పలు గ్రామాల కూడల్లో ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. బైక్‌లపై తిరిగేవారిని కుక్కలు చుట్టుముట్టి పడదోస్తున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకొనే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పలువురు గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

మండలంలో 32 పంచాయతీల్లోని గ్రామాల్లో కుక్కల సంతతి విపరీతంగా పెరిగింది. గ్రామాల్లో వీధుల్లో ఎక్కడపడితే అక్కడి రోడ్డుపైనే నిద్రిస్తాయి. వాహనాల చోదకులు, ప్రజలపై విచ్చలవిడిగా దాడులు చేసి కాటు వేస్తున్నాయి. దీనిపై ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కుక్కల సంచారంతో అప్రమత్తంగా ఉండాలి
- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికి ఒకసారి విధిగా టీకాలు వేయించాలి.
- వీధి కుక్కలకు విధిగా రేబీస్ టీకాలు వేయించాలి
- వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నందున పిల్లలను ఆరుబయట పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించాలి





ఎగువ మొదలపల్లె వద్ద కోళ్లఫారం వద్ద తిరుగుతున్న కుక్కలు, చిగరాకులపల్లె వద్ద రోడ్డుపై సంచరిస్తున్న వీధికుక్కలు

2024లో కుక్కకాటు బాధితుల సంఖ్య

జనవరి- 45	జూలై - 45
ఫిబ్రవరి- 47	ఆగస్టు - 42
మార్చి - 40	సెప్టెంబర్ - 35
ఏప్రిల్ - 30	అక్టోబర్ - 46
మే - 30	నవంబర్ - 36
జూన్ - 47	డిసెంబర్- 50


బయటకు రావాలంటే భయమేస్తోంది



మండలంలో పలు గ్రామాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. పల్లెలో సుమారు 50 కుక్కల కంటే అధికంగా ఉన్నాయి. రాత్రి అయినా, పగలు అయినా ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. పంచాయతీ అధికారులు కుక్కలను పట్టించి కట్టడి చేయాలి.

–మురుగన్, దిగువ తడకర

అందుబాటులో మందులు



తవణంపల్లె పీహెచ్‌సీలో కుక్కకాటుకు మందులు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో నెల రోజుల్లో కనీసం 40 నుంచి కుక్కకాటు బాధితులు వస్తున్నారు. సకాలంలో వైద్యం అందిస్తున్నాం. కుక్క కాటుకు గురైన బాధితులు ఎంత రాత్రిలో వచ్చినా చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ మోహన్‌వేలు, వైద్యాధికారి తవణంపల్లె

గోవులను కబేళాలకు తరలిస్తే ఊరుకోం



బాధ్యతలు స్వీకరిస్తున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు: పవిత్ర భారతదేశంలో గోవులకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అలాంటి గోవులను కబేళాలకు తరలించి, లక్షలాది రూపాయలు సంపాదించే వారి భరతంపడతామని, కబేళాలను అడ్డుకుంటామని జాతీయ గోసంరక్షణ జనరల్ సెక్రటరీ అయూబ్‌ఖాన్ హెచ్చరించారు. బుధవారం పట్టణ ప్రముఖుల ఆధ్వర్యంలో ఆయన జాతీయ గోసంరక్షణ జనరల్ సెక్రటరీ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆల్ ఇండియా కౌవ్ ప్రొటెక్షన్ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు ఖలీమ్ భారతీయ నియామక ఉత్తర్వులు పంపారు. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో పశువులను కబేళాలకు తరలిస్తూ లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నారని తెలిపారు. పశువులను కబేళాలకు తరలించడం మహాపాతకమన్నారు. వీటిని అన్ని ప్రాంతాల్లోను అడ్డుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తవత్సలరాజు, బాలసుబ్రమణ్యం, త్రిమూర్తిరెడ్డి, ముత్యాలు, ఎర్రప్ప యాదవ్, మునస్వామి, రెడ్డెప్పరెడ్డి, టీపీఎస్.నాగరాజు, రాజు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.